క్లుప్తంగా

ఫోన్ల అప్పగింత



బాధితులకు ఫోన్లు అప్పగిస్తున్న సీఐ కిరణ్, ఎస్సై మహేష్

హుస్నాబాద్: పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ సహాయంతో పోలీసులు స్వాధీనం చేసుకొని సోమవారం బాధితులకు అప్పగించారు. సీఐ ఎర్రల కిరణ్ కథనం ప్రకారం.. పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో.. కుడేమేత గీత, లావుడ్యా హరిలాల్, ఆవుల అభిలాష్, కోహెడ పోలీస్ స్టేషన్ పరిధిలో గీకూరు శ్రీకాంత్‌లు 15 రోజుల క్రితం ఫోన్లు పోగొట్టుకున్నారు. వారు వెంటనే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫోన్‌ల ఐఎంఈఐ నంబర్‌ను ఎంటర్ చేసి బ్లాక్ చేశారు. ఆ ఫోన్స్ దొరికిన వ్యక్తులు అందులో సిమ్ కార్డు వేసుకోగానే వెబ్‌సైట్ ద్వారా వివరాలతో కూడిన సమాచారం అందింది. వారి నుంచి స్వాధీనం చేసుకొని బాధితులకు అందజేసినట్లు సీఐ కిరణ్, ఎస్సై మహేష్ తెలిపారు.

దరఖాస్తులు ఆహ్వానం

సిద్దిపేటజోన్: మున్సిపాలిటీ పరిధిలోని పార్కులు, నీటి శుద్ధి కేంద్రాలు, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణ కోసం ఆసక్తి ఉన్న వారు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణ పరిధిలోని మహిళ స్వయం సహాయక సంఘాలకు అమృత్ మిత్ర పేరిట పథకం అమలు చేస్తున్నామన్నారు. ఈనెల 15 తేదీ లోగా మున్సిపల్ కార్యాలయంలోని మెప్మా విభాగంలో దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వహణ ఖర్చులు ఇస్తామన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి రాకుండా చూడాలి



మేరీస్వర్ణకుమారిని సన్మానిస్తున్న ఎంపీపీ తదితరులు

వర్గల్(గజ్వేల్): వేసవిలో సాగు, తాగు నీటి ఎద్దడి రాకుండా అధికారులు జాగ్రత్త వహించాలని వర్గల్ ఎంపీపీ జాలిగామ లతరమేష్‌గౌడ్ అన్నారు. సోమవారం ఎంపీడీఓ మేరీస్వర్ణకుమారి పర్యవేక్షణలో మండల పరిషత్ సమావేశం సాదాసీదాగా జరిగింది. గృహజ్యోతి 200 యూనిట్ల లోపు ఇళ్లకు ఫ్రీ కరెంట్ అంశాన్ని ఎంపీపీ, నాచారం ఎంపీటీసీ వెంకటేష్‌గౌడ్ విద్యుత్ అధికారులతో ప్రస్తావించారు. విద్యుత్ మీటర్ కలిగిన వ్యక్తి పేరు రేషన్‌కార్డులో ఉంటే పథకం వర్తిస్తుందని ఏఈ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. ప్రత్యేకాధికారులు ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని మేరీస్వర్ణకుమారి సూచించారు. బదిలీపై వెళుతున్న విషయం ప్రస్తావిస్తూ విధి నిర్వహణలో సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు.

కొండపోచమ్మకు భక్తుల తాకిడి

జగదేవ్‌పూర్(గజ్వేల్): కొండపోచమ్మ అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. ఆదివారం కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్న భక్తులు సోమవారం ఉదయం కొండపోచమ్మ దర్శనానికి తరలివచ్చారు. బోనాలను మహిళలు నెత్తిన ఎత్తుకుని డప్పు చప్పుళ్ల మధ్య అమ్మను దర్శించుకుని పూజలు నిర్వహించారు. మొక్కులు చెల్లించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వెంకటరెడ్డి, కనకయ్య, హరి, చిన్నా, చందు , సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీని కలిసిన నూతన ఎస్‌ఐలు



సీపీని కలిసిన ఎస్‌ఐ అపూర్వరెడ్డి

సిద్దిపేటకమాన్: కమిషనరేట్ పరిధిలోని పలు పోలీస్ స్టేషన్లకు నూతన ఎస్‌ఐలు బాధ్యతలు చేపట్టిన అనంతరం సీపీ అనురాధను సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. సిద్దిపేట రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి, రాజగోపాల్‌పేట ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, కుకునూర్‌పల్లి ఎస్‌ఐ శ్రీనివాస్, దౌల్తాబాద్ ఎస్‌ఐ ప్రేమ్‌దీప్ కలిశారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై ప్రత్యేక నిఘా పెట్టాలని సీపీ సూచించారు.

వీణాపాణి కృప 'అనంతం'

- నేటి నుంచి అనంతసాగర్‌లో సరస్వతీ మాత ఉత్సవాలు
- ఘనంగా ఏర్పాట్లు

చిన్నకోడూరు(సిద్దిపేట): పచ్చని చెట్లు.. ప్రశాంత వాతావరణం..కొండల వరుసలు.. పక్షుల కిలకిల రాగాలు... చుట్టూ గుట్టలు దట్టని అడవులు, సహజ సిద్ధంగా ఏర్పడిన జలగుహల సోయగాల మధ్య ప్రకృతి ఒడిలో వీణాపాణి సరస్వతీ మాత కొలువుదీరింది. దేశంలోనే రెండో సరస్వతీ క్షేత్రంగా విరాజిల్లుతోంది. భక్తుల విశేష పూజలు అందుకుంటోంది చిన్నకోడూరు మండలం అనంతసాగర్ సరస్వతీ క్షేత్రం. ఈ ఆలయంలో అక్షరాభ్యాసం చేయిస్తే పిల్లలు ప్రతిభావంతులు అవుతారని భక్తుల విశ్వాసం. ఏటా అమ్మ జన్మదినాన అక్షరాభ్యాసలతో ఆలయ పరిసరాలు కిటకిటలాడుతాయి. ఈ నెల 14న సరస్వతీ మాత జన్మదినాన్ని (వసంత పంచమి) పురస్కరించుకుని ఏటా నిర్వహించే వార్షికోత్సవాలకు ఆలయాన్ని ముస్తాబు చేశారు. 13 నుంచి 15 వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు.



సరస్వతీ మాత విగ్రహం



ఆలయ రాజగోపురం

ఆలయ చరిత్ర...

చిన్నకోడూరు మండలం అనంతసాగర్ శివారులో పూర్వ కాలంలోనే సహజ సిద్ధంగా ఐదు జలగుహలు ఏర్పడ్డాయి. భక్తులు దోనెలుగా పిలుస్తున్నారు. ఇందులో మాఘ అమావాస్యన స్నానం చేస్తే పుణ్యం లభించి మంచి జరుగుతుందనేది ప్రజల నమ్మకం. అయితే రెండు దోనెలు మూసుకు పోగా రాగి, పాల, చీకటి దోనెలు మాత్రం మిగిలాయి. ఏడాది పొడవునా నీరుండటం విశేషం. ఇక్కడే సిద్దిపేటకు చెందిన అష్టావధాని అష్టకాల నరసింహరామశర్మ 1980 మే 2న ఆలయానికి శంకుస్థాపన చేశారు. పదేళ్ల పాటు శ్రమించి ఆలయాన్ని పూర్తి చేసి 1990 జనవరి 1న నిల్చుని ఉన్న సరస్వతీ మాత విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నాటి నుంచి భక్తులకు ఆరాధ్య దైవంగా మారింది. క్షేత్రంలో సౌభాగ్యలక్ష్మి, మహంకాళీ, హనుమాన్ విగ్రహాలను సైతం ప్రతిష్ఠించారు. రాజగోపురంతో పాటు ధ్యాన మందిరాన్ని, యజ్ఞ మంటపం, యాత్రికుల గదులు, నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మించారు. ఈ ఉత్సవాలకు సిద్దిపేట, కరీంనగర్, సిరిసిల్లా జిల్లాలకు చెందిన వేల మంది భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మాత ఆశీస్సులు పొందుతారు.



అదనపు కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు

విద్యార్థుల ప్రతిభకు అదనపు కలెక్టర్ ఫిదా

అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించిన గరీమా

మర్కూక్(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు జిల్లా అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్ ఫిదా అయ్యారు. సోమవారం మండలంలోని అంగడికిష్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఇక్కడ అమలవుతున్న ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రాథమిక విద్య చదువుతున్న ఇద్దరు యుకేజీ విద్యార్థులు రంగు అశ్విక, మన్నె యశ్విన్ దేశంలో అన్ని రాష్ట్రాలు, రాజధానులు, రాష్ట్రాలు ముఖ్యమంత్రుల పేర్లను చెప్పి అబ్బుర పరిచారు. దీంతో అదనపు కలెక్టర్.. ఫిదా అయిన విద్యార్థులకు శాలువాలు కప్పి సత్కరించారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య లభిస్తోందన్నారు.

పనుల పరిశీలన

అంగడికిష్టాపూర్‌లో అదనపు కలెక్టర్ పర్యటిస్తూ జరిగిన అభివృద్ధి పనులను, జరుగుతున్న వాటిని పరిశీలించారు. రైతు వేదిక, నర్సరీ, డంప్ యార్డు, వైకుంఠదామం, పల్లె ప్రకృతి వనాన్ని పరిశీలించారు. మురుగు కాల్వల నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. చేపట్టిన అభివృద్ధి పనుల్లో వాటి సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ కౌసల్యదేవి, డీఎల్‌పీఓ వేదావతి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీఓ లింగం, కార్యదర్శి నీలిమ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓంకార్ రాధాకృష్ణ,పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో సత్తా చాటాలి

మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

హుస్నాబాద్: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. హుస్నాబాద్ బీఆర్ఎస్ కార్యాయలంలో సోమవారం పార్టీ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమ పార్టీకి పోరాటాలు కొత్త కాదన్నారు. ఆటుపోట్లను దాటి మళ్లీ పుంజుకుంటామన్నారు. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా ఆదుకుంటానని, త్వరలోనే పార్టీ ఆదేశం మేరకు అన్ని కమిటీలను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. త్వరలో జరగనున్న కరీంనగర్ పార్లమెంట్ ఎన్నికల్లో మాజీ ఎంపీ వినోద్‌కుమార్ భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ అకుల రజిత, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, మాజీ మున్సిపల్ చైర్మన్ సుద్దాల చంద్రయ్య, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాషా, నాయకులు చిట్టి గోపాల్ రెడ్డి, అయిలేని మల్లికార్జున్ రెడ్డి ఉన్నారు.

నిబంధనలపై యువతకు అవగాహన

గజ్వేల్‌రూరల్: రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలపై యువత అవగాహన కలిగి ఉన్నప్పుడే రోడ్డు ప్రమాదాలను నివారించ వచ్చని ప్రొఫెసర్ శ్రీధర్ పేర్కొన్నారు. పట్టణంలోని బాలుర ఎడ్యుకేషన్ హబ్ ఆవరణలో గల ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో సోమవారం ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విభాగాల ఆధ్వర్యంలో ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. నిబంధనలపై అవగాహన లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈ ప్రమాదాల్లో 50 శాతం వరకు యువతే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఫిబ్రవరి 2వ వారంలో ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమాలను చేపడుతున్నట్లు గుర్తు చేశారు. సీట్ బెల్టు, హెల్మెట్ పెట్టుకోకుండా, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం తాగి వాహనం నడపడం వల్ల ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతి, అధ్యాపకులు బాలరాజు, డాక్టర్ రమేష్‌బాబు, విజయభాస్కర్, రామచంద్రం, డాక్టర్ పెద్దిరాజు, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ డాక్టర్ భవాణి, మార్కండేయ, డాక్టర్ కవిత, లక్ష్మీనర్సయ్య, నవీన్, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



అక్రమ నిర్మాణాన్ని కూల్చి వేస్తున్న ఉద్యోగి

సిద్దిపేటరూరల్: అక్రమంగా నిర్మించిన అన్ని నిర్మాణాలను కూల్చివేస్తామని నారాయణరావుపేట గ్రామపంచాయతీ కార్యదర్శి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మార్కెట్‌కు దగ్గరలో ఎలాంటి అనుమతి లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని అందిన ఫిర్యాదు మేరకు సిబ్బందితో కలిసి ఆయన అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. ఈ సందర్భంగా కార్యదర్శి కిషన్‌రావు మాట్లాడుతూ ముందస్తు అనుమతి పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో కారోబార్ రాజాలింగం, సిబ్బంది పాల్గొన్నారు.

కనుల పండువగా శివపార్వతుల కల్యాణం



మహోత్సవంలో భక్తులు



శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న నిర్వాహకులు

మిరుదొడ్డి(దుబ్బాక): లోక కల్యాణార్థం మిరుదొడ్డి, లక్ష్మీనగర్, ఆరెపల్లి గ్రామాల శివారులోని సదానందాశ్రమంలో సోమవారం శివ పార్వతుల కల్యాణం కనుల పండువగా జరిగింది. 18 రోజులుగా ఆశ్రమంలో భగవద్గీత, భాగవత పారాయణాలు గావిస్తున్నారు. కల్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వీక్షించారు. కార్యక్రమంలో వైదిక నిర్వాహకులు విశాల రాజపున్నయ్య శర్మ, చంద్రశేఖర శర్మ, రమేష్ శర్మ, ఆశ్రమ శిష్య బృందం సభ్యులు మల్లయ్య, శివకుమార్, శ్రీనివాస్, మల్లికార్జున్, ఎల్లాగౌడ్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణతో పాటు అన్నదానం నిర్వహించారు.

డ్రంకెన్ డ్రైవ్ నిందితులకు జరిమానా

సిద్దిపేటకమాన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ రామకృష్ణ బుధవారం తెలిపారు. పట్టణంలోని సర్వాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తాతో పాటు రాజీవ్ రహదారిపై పలు చోట్ల ఐదు రోజుల క్రితం వాహనాల తనిఖీ నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిని పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు. విచారణ జరిపిన జడ్జి శ్రావణి.. 16 మందికి రూ.28వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల బదిలీలు

సిద్దిపేట కమాన్: లోకసభ సాధారణ ఎన్నికల్లో భాగంగా జిల్లాలో పలువురు ఎక్సైజ్ అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. చేర్యాల సీఐగా పని చేస్తున్న మహేంద్రకుమార్ బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో మెదక్ జిల్లా జోగిపేట నుంచి మురళీకృష్ణ రానున్నారు. మిరుదొడ్డి ఎస్ఐగా జగిత్యాల నుంచి సరితను, హుస్నాబాద్ ఎస్ఐగా కరీంనగర్ నుంచి రూపను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా



వ్యాపారస్తులకు అవగాహన కలిఎస్తున్న పోలీస్ అధికారులు

మద్దూరు(హుస్నాబాద్): సీసీ కెమెరాలతో నిరంతర నిఘా ఉంటుందని చేర్యాల సీఐ శ్రీను అన్నారు. మద్దూర్ మండల కేంద్రంలోని దుకాణాల యజమానులకు సీసీ కెమెరాల వల్ల కలిగే ఉపయోగాలపై మద్దూర్ ఎస్ఐ షేక్ యూనిస్ హమ్మద్‌తో కలిసి ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యాపారస్తులు, ప్రజలు ప్రజాప్రతినిధులు వారి దుకాణాల్లో, గృహాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ పోలీస్ సింగ్‌లో భాగంగా ఒక సీసీ కెమెరా మెయిన్ రోడ్డు కనపడేలా ఏర్పాటు చేసుకోవాలన్నారు. వ్యాపారస్తులు సమష్టిగా కృషి చేయాలని తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ ఉపాధ్యాయుల పాత్ర లేదు

కొండపాక(గజ్వేల్): అయోధ్యలో రామమందిర ప్రారంభోత్సవ సమయంలో మర్పడ్గ హైస్కూల్ విద్యార్థులు నృత్య ప్రదర్శన చేయగా అందులో ఉపాధ్యాయుల పాత్ర ఏమి లేదని ఎంపీటీసీ పత్తి అంజనేయులు, తల్లిదండ్రులు తెలిపారు. సోమవారం కలెక్టర్‌కు లిఖిత పూర్వకమైన పత్రాన్ని అందజేశారు. ఈ సమయంలో గ్రామస్తులందరూ కులమతాలకతీతంగా నిర్వహించిన రథోత్సవంలో తల్లిదండ్రుల కోరిక మేరకే ప్రదర్శనలో పాల్గొన్నారన్నారు. దీనికి పలు విద్యార్థి సంఘాలు విద్యార్థులు.. ఉపాధ్యాయులు కావాలని పంపించారని ఇటీవల కలెక్టర్ కార్యాలయంలో, డీఈఓకు ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. కాగా.. మధ్యాహ్న భోజన పథకంలో హెచ్ఎం అక్రమాలకు పాల్పడుతున్నారన్న విషయాన్ని బయట పెట్టడంతో 2021 నుంచి పని చేస్తున్న ముగ్గురు కార్మికులను తొలగించారని దీనిపై ప్రజావాణిలో అర్జీని సమర్పించినా గానీ మరో లేఖను కలెక్టర్‌కు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

◆ సార్వత్రిక సమ్మెకు తరలిరండి

చేర్యాల(సిద్దిపేట): కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెకు తరలిరావాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఇప్పకాయల శోభ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక పౌర సరఫరా కేంద్రం ఎదుట సమ్మె కరపత్రాలను హమాలీ కార్మికులతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్‌లుగా చేసి కార్మికులను బానిసలుగా చేసే ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. కార్యక్రమంలో సంఘం పట్టణ కన్వీనర్ రాళ్లబండి భాస్కర్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

◆ స్పోర్ట్స్ దుస్తుల పంపిణీ

చిన్నకోడూరు(సిద్దిపేట): విద్యార్థులకు సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. మండల పరిధిలోని మాచాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ఏలేటి రాజిరెడ్డి సహకారంతో రూ. 25 వేలను వెచ్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాలను చేరుకుని గ్రామానికి మంచి పేరు తీసుకు రావాలన్నారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచ్ బాబు, పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

◆ కిడ్నాప్ వదంతులు నమ్మొద్దు



అక్కన్నపేట(హుస్నాబాద్): కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో వస్తున్న చిన్నపిల్లల కిడ్నాప్ వదంతులను ప్రజలెవరూ నమ్మొద్దని ఎస్సై తాండ్ర వివేక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్టేషన్ ఆవరణంలో సామాజిక మాధ్యమాల్లో వస్తున్న కిడ్నాప్ వదంతులను నమ్మొద్దని.. ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎలాంటి కిడ్నాప్‌లు చేసే గ్యాంగ్‌లు లేవన్నారు. గ్రామాల్లో ప్రజలెవరూ భయపడవల్సిన అవసరం లేదన్నారు. ఎవరైనా అనుమానాస్పదగా వ్యక్తులు తిరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్ రామస్వామి, కానిస్టేబుల్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ మహిళలు ఆర్థికాభివృద్ధిని సాధించాలి

కొండపాక(గజ్వేల్): మహిళలు స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా లాభపడాలని మాజీ సర్పంచ్ పొల్కంపల్లి జయంతి పేర్కొన్నారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో నాబార్డు సహకారంలో ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మగ్గం వర్క్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌తో కలిసి ఆయన సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వ అనుబంధ సంస్థల సహకారంతో స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయన్నారు. 30 మంది మహిళలకు 20 రోజుల పాటు శిక్షణతోపాటు మధ్యాహ్నభోజనం రూ.వెయ్యి స్టైఫెండ్‌ను అందిస్తారన్నారు. కార్యక్రమంలో పీఎస్ఆర్ ట్రస్ట్ నిర్వాహకులు నరేందర్, సీసీ లింగం, వీఓ లీడర్లు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

◆ అల్పాహారం

హుస్నాబాద్: ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు అల్పాహారాన్ని వాసవీ క్లబ్ సోమవారం అందజేసింది. ఈ సందర్భంగా హెచ్ఎం వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ టెన్త్ విద్యార్థులకు సాయంత్రం 5.45 నిమిషాల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం అల్పాహారం అందించకపోవడం వల్ల ఆకలితో చదువు పై ఏకాగ్రత కనబరచడం లేదన్నారు. ఈ విషయమై దాతలు సహకరించాలని కోరితే వాసవీ క్లబ్ నెల రోజుల పాటు అల్పాహారం అందించడానికి ముందుకు రావడం సంతోషకరమన్నారు.

◆ ఎంపీడీఓకు సన్మానం

జగదేవ్‌పూర్(గజ్వేల్): జగదేవ్‌పూర్ ఎంపీడీఓ పట్టాభిరామారావు నాగర్‌కర్నూల్‌కు బదిలీ కాగా సోమవారం మండల కార్యాలయంలో ఎంపీపీ బాలేషంగౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. మండలంలోని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. అధికారులకు బదిలీలు సహజమేనని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ బెజ్జంకిలో...



బెజ్జంకి(సిద్దిపేట): బదిలీపై వెళుతున్న బెజ్జంకి ఎంపీడీఓ రామును మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ లింగాల నిర్మల, మండల కోఆప్షన్ సభ్యులు పాకాల మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, తిరుపతి, దీటి బాలనర్సు, బొనగిరి శ్రీనివాస్, తిరుపతి, దేవయ్య, మల్లేశం, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

◆ జగదేవ్‌పూర్‌లో..

జగదేవ్‌పూర్(గజ్వేల్): స్థానిక ఎంపీడీఓ పట్టాభి రామారావు నాగర్‌కర్నూల్‌కు బదిలీ కావడంతో మండల కార్యాలయంలో ఎంపీపీ బాలేషంగౌడ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. మండలంలోని ఆయన చేసిన సేవలను గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

◆ ఎస్ఐకి శుభాకాంక్షలు

దౌల్తాబాద్(దుబ్బాక): ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన శ్రీరామ్ ప్రేమ్‌దీప్‌ను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పడాల రాములు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఆదివేణుగోపాల్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండారులాలు, మద్దెల స్వామి, బ్యాగారి రాజు, మల్లారెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ మండల నాయకులు అనిల్‌రెడ్డి, తుమ్మ గణేష్, మల్లేశంలూ ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

◆ కూడవెల్లి హుండీ లెక్కింపు

దుబ్బాకరూరల్: మాఘ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని అక్బర్‌పేట భూంపల్లి మండలం కూడవెల్లి రామలింగేశ్వరస్వామి జాతర ఉత్సవాలు 4 రోజుల వరకు సాగాయి. సోమవారం హుండీని లెక్కిస్తే ఆదాయం రూ.2,70,809లు వచ్చినట్లు ఆలయ కమిటీ ఈఓ విశ్వనాథశర్మ తెలిపారు.

◆ రేపు సాముహిక అక్షరాభ్యాసం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఈనెల 14న వసంత పంచమిని పురస్కరించుకుని పట్టణంలోని సరస్వతీ శిశుమందిర్‌లో సాముహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు సోమవారం ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 8.15 నిమిషాలకు అక్షరాభ్యాస కార్యక్రమం ప్రారంభమవుతోందన్నారు. వివరాలకు 99669–32727 నంబర్లో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

◆ మాజీ సీఎం దిష్టిబొమ్మ దహనం

బెజ్జంకి(సిద్దిపేట): కృష్ణా జలాలపై తమ హయాంలో జరిగిన తప్పిదాన్ని కప్పి పుచ్చుకోవడానికి బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్ నల్లగొండలో సభ పెట్టారని ఆరోపిస్తూ బెజ్జంకిలో.. కాంగ్రెస్ నాయకులు ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రొద్ద మల్లేశం, తిప్పారపు మల్లేశం, రావుల నర్సయ్య, శ్రవణ్‌కుమార్, శ్రీకాంత్, ప్రవీణ్, అయిలయ్య, శ్యాం, రాజు, రమేష్, కొంరయ్య, తదితరులు పాల్గొన్నారు.